# అనావృష్టి కాలంలో ప్రభుత్వం నుండి మీకు హక్కుగా రావలసినవి పొందండి!

**గ్రామీణ ప్రజలారా!**

మీ ప్రాంతాన్ని ఈ ఏడాది కూడా అనావృష్టి ప్రాంతంగా ప్రకటించిన విషయం మీకు తెలిసే వుంటుంది. ఆంధ్రప్రదేశ్‌లో 2016-17 సంవత్సరంలో 301 మండలాలను అనావృష్టి మండలాలుగా ప్రకటించారు. ప్రభుత్వం కరువు ప్రాంతం ప్రకటించినప్పుడు, మీకు ఆ గడ్డు పరిస్థితి నుంచి ఊరట కల్పించడానికి ప్రభుత్వం కొన్ని ప్రత్యేక సహాయక సేవలు అందిస్తుంది. మన రాజ్యాంగంలో "జీవించే హక్కు"లో భాగంగా ఇవన్నీ కూడా మీ హక్కు. ఇటీవల ఒక ప్రజాహిత పిటీషన్‌కి స్పందిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు, ఇతర అనేక చట్టాల ద్వారా కూడా మీకు ఆ హక్కులు వచ్చాయి.

**నీటి సరఫరా :**

మీకు తాగునీటికి, ఇంట్లో అవసరాలకి నీరు సరఫరా అయ్యేలా చూడడం ప్రభుత్వం బాధ్యత. అవసరమైతే జిల్లా కలెక్టర్ నీళ్ళ ట్యాంకర్లు ఏర్పాటు చేయవలసి వుంటుంది. అవి మీకు అందుతున్నాయా?

**ఆహార భద్రత:**

వేసవి సెలవుల్లో కూడా పిల్లలకు మధ్యాహ్న భోజనం తప్పనిసరిగా ఇవ్వాలి. ముఖ్యంగా వారంలో కనీసం మూడు సార్లు గుడ్డు/పాలు ఇవ్వాలి. అది జరుగుతోందా? అనావృష్టి ప్రాంతంలో పౌరులందరికీ రేషన్‌కార్డు ఉన్నా, లేకపోయినా నెలకి ఒకసారి ఒక్కొక్కరికి అయిదు కిలోల రేషన్ బియ్యం ఇవ్వాలి. మీకు రేషన్ అందుతోందా? దిక్కుమొక్కు లేనివారి కోసం అవసరమైతే సామూహిక వంటశాలలు తెరవాలి. మీరు ఈ విషయం అడిగారా?

**బ్యాంకు మద్దతు:**

ఈ కాలంలో బ్యాంకులు మీ పంట రుణాలు దీర్ఘకాలిక రుణంగా మార్చి, మీకు తాజాగా పంట రుణాలు ఇవ్వాలి. పైపెచ్చు, వడ్డీ రేట్లలో అపరాధ రుసుము చేర్చడానికి వీల్లేదు. అనావృష్టి వచ్చిన ఏడాది అప్పు చెల్లించాలని వారు లిఖితపూర్వకంగా కానీ, వేరే విధంగా కానీ నోటీసులు ఇచ్చి మీ పైన వత్తిడి తేవడానికి వీల్లేదు. మీకు ఒక ఏడాది వాయిదా తప్పనిసరిగా లభిస్తుంది. ఇలా జరుగుతోందా?

**ఉపాధి హామీ:**

పని కోరేవారు ఎవరైనా మీరు అడిగినప్పుడల్లా ప్రభుత్వం 150 రోజుల పాటు పని కల్పించాలి. అవసరమైతే, ఉపాధి హామీ పథకమే కాకుండా ఇతర పథకాల కింద కూడా పని ప్రారంభించి మీకు వుపాధి ఇవ్వాలి. మీ వేతనాలు తక్షణమే చెల్లించాలి. లేదా ఆలస్యం అయిన పక్షంలో వేతనంలో 0.05 శాతం పరిహారంతో సహా చెల్లించాలి. మస్టర్ రోల్ మూసివేసిన 16వ రోజుకి మించి జాప్యం జరిగితే ఇది వర్తిస్తుంది. వేతనాల్లో బకాయిలు కూడా తక్షణమే తీర్చాలి. అడిగితే పని కల్పించకపోతే 'నిరుద్యోగ భృతి' చెల్లించాలి. అంతే కాదు, ప్రభుత్వం మీకు 30 శాతం ఎక్కువగా వేసవి భృతి చెల్లించడంతో పాటు చేయగలిగే పనులు మరిన్ని చూపించాలి. పని చేసే చోట మీకు మంచి నీరు, పిల్లలకు ఒక సంరక్షణ కేంద్రం (5 సంవత్సరాలలోపు వయసు పిల్లలు అయిదుగురి కంటే ఎక్కువ మంది వుంటే), తల దాచుకునే నీడ... ఇవన్నీ కూడా వుండాలి. ఇవన్నీ వుండాలని మీరు డిమాండ్ చేశారా?

**పశు సంబంధిత సహాయం:**

పశుగ్రాసం శిబిరాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం తప్పనిసరిగా గ్రాసం డిపోలు తెరవాలి. పశువులకు కూడా పరిస్థితిని బట్టి పశుగ్రాసం, నీటి సరఫరాలతో శిబిరాలు ఏర్పాటు చేయాలి.

అక్టోబర్ నెల నుంచే ప్రభుత్వం పశుగ్రాసం శిబిరాలు ఏర్పాటు చేసి పశువులను అనావృష్టి నుంచి కాపాడాలి. జిల్లా యంత్రాంగం అటవీ శాఖ నుంచి పశుగ్రాసం సరఫరా ఏర్పాటు చేయాలి. ఈ ఏర్పాట్లు చేయాలని పట్టుబట్టారా?

**పంట నష్ట పరిహారం:**

విపత్తు పరిస్థితిలో పంట బీమాతో సంబంధం లేకుండా, మీకు ఇన్‌పుట్ సబ్సిడీ కూడా పరిహారంగా చెల్లించాలి. (మీరు కనుక పంట ఋణం తీసుకున్న రైతు అయితే మీకు తప్పనిసరిగా బీమా వుంటుంది). 2015 అనావృష్టి సంవత్సరానికి మీకు రావలసిన ఇన్‌పుట్ సబ్సిడీ ఎకరానికి 6,000 రూపాయలు (వరి, వేరుశెనగ, పత్తి) లేదా ఎకరానికి 4,000 (మినుములు, కందులు, పెసర, సోయా బీన్, వులవలు) చెల్లించాల్సి వుంది. మీకు ఈ చెల్లింపు జరిగిందా?

**అనావృష్టి ప్రత్యేక సహాయం:**

మరీ సమస్య ఎదుర్కొంటున్న కుటుంబాలకు జిల్లా యంత్రాంగం పెద్దలకు 65 రూపాయల చొప్పున, పిల్లలకు 40 రూపాయల చొప్పున దినసరి భత్యం 90 రోజులు ఇవ్వవచ్చు. మీకు ఈ సహాయం లభించిందా?

**ఎండ దెబ్బ ప్రమాదం వుంది! ఈ జాగ్రత్తలు తీసుకోండి!**

ఎండ దెబ్బ వల్ల మనుషులు ప్రాణాలు కోల్పోతున్నారని మనం రోజూ వార్తలు వింటున్నాం. ఇందులో ఎక్కువ భాగం వేసవి ఎండలో కష్టించి పని చేసి తమ పొట్ట గడుపుకునేవారే! ఎండ దెబ్బ అంటే వైద్యపరంగా అత్యవసర పరిస్థితి. నిర్లక్ష్యం చేయకండి. ఇది ప్రాణాంతకం!

**ఎండ దెబ్బ తగిలిందనడానికి సూచనలు:**

ఎక్కువ వంటి వేడి, వాంతులు, తలనెప్పి, అలసట, ఊపిరి అందకపోవడం, గుండె వేగంగా కొట్టుకోవడం, తల తిరిగినట్లు కావడం, అయోమయం, వేడి ఉన్నపటికీ చెమట పట్టకపోవడం. పసి పిల్లలు, ముసలివారు, బయట ఎండలో పని చేసేవారు ఎండ దెబ్బ ప్రమాదం ఎదుర్కొంటారు. ఎండా కాలంలో తేలికగా, మరీ పట్టినట్లు లేకుండా వుండే దుస్తులు వేసుకోవాలి. బాగా మంచినీళ్లు తాగాలి. తలపైన కప్పుకుని ఎండా తగలకుండా చూసుకోవాలి. రోజులో మరీ ఎక్కువ ఎండ వుండే సమయంలో వీలైతే బయటకి వెళ్లకుండా జాగ్రత్త పడాలి. ఎండలో మరీ శరీర శ్రమ వుండే పనులు చేయకూడదు. ఎండ దెబ్బ తగిలిన లక్షణాలు కనిపిస్తే, 108 అంబులెన్స్ పిలుచుకుని వెంటనే ఆసుపత్రికి వెళ్ళాలి. ఈ లోపు ఎండ దెబ్బ తగిలిన వ్యక్తిని, చల్లని ప్రదేశంలో వుంచి ముఖం మీద, శరీరం మీద మధ్యమధ్యలో నీళ్ళు చల్లి గాలి విసరాలి. (http://www.imdhyderabad.gov.in/apsite/andhra.pdf)

ఎండ దెబ్బ తగిలి మరణం సంభవించిన సందర్భంలో ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి బాధిత కుటుంబాలకు లక్ష రూపాయల పరిహారం చెల్లిస్తుంది. మరణం సంభవించిన మూడు రోజుల్లోపుగా రెవెన్యు శాఖ అధికారులకు మరణం వార్త తెలియచేయండి. (మీకు వి.ఆర్.ఓ. అందుబాటులో వుంటారు), మరణ ధృవీకరణ పత్రంతో వి.ఆర్.ఓ. సర్టిఫికెట్ జతపరచండి. ప్రభుత్వం ఇప్పుడు పోస్ట్ మార్టం నివేదిక కావాలని అడగడం లేదు. కేవలం ముగ్గురు అధికారుల దర్యాప్తు నివేదికను ఆమోదిస్తుంది.

**మంచి అవగాహన గల పౌరులుగా, మీరు మీకు హక్కుగా రావలసినవి అన్నీ పొందాలి. ప్రభుత్వం కరువు కాలంలో తన బాధ్యత నెరవేర్చేలా చూడాలి. ఇది మీ రాజ్యాంగ హక్కు.**


**రైతు స్వరాజ్య వేదిక** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ

*తేది: 01-05-2017*

*మరిన్ని వివరాలకు : భానూజ : 9440017188, శివా రెడ్డి – 7386980760, మోహన్ – 9490406339, యల్లప్ప – 9989873358, అమర్‌నాథ్ – 8978547840, అనిత – 9059913358*